క్లుప్తంగా

వర్షంతో దుంప రైతులకు మేలు

మెట్టలో ముమ్మరంగా నాట్లు



నాట్లు వేయడానికి పొలానికి నారును తరలిస్తున్న రైతులు

రంగంపేట: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షం రంగంపేట మండల దుంప రైతులకు మేలు చేసింది. వర్షాలు లేక దుంప నారుమళ్ళు ముదిరిపోయి దిక్కుతోచని స్థితిలో ఉన్న దుంప రైతులను వరుణుడు ఆదుకున్నాడు. ఈ వర్షంతో మండలంలోని పలు గ్రామాల్లో దుంప నాట్లు ముమ్మరంగా మొదలయ్యాయి. అయితే రంగంపేట మండలంలో గతంలో ఐదు వేల ఎకరాలలో సాగయ్యే కర్ర పెండలం దుంప పంట గతేడాది రెండున్నర వేల ఎకరాలకు తగ్గిపోయింది. ఈ ఏడాది రెండు వేల ఎకరాలకు మించదని ఉద్యానవన శాఖ ప్రాథమికంగా అంచనా వేస్తుంది.

వైఎస్సార్ సీపీ నాయకుడికి పరామర్శ

మధురపూడి: కోరుకొండ మండలం బుచ్చెంపేట గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గొంతి కేశవ కుటుంబాన్ని పార్టీ నాయకులు పలువురు బుధవారం పరామర్శించారు. ఇటీవల ఆయన తండ్రి ధర్మరాజు మృతి చెందారు. పార్టీ నాయకులు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు తదితరులు సానుభూతి తెలిపారు.

కష్టం తీర్చి.. కన్నీళ్లు తుడిచి..

- పంటల ముంపు సమస్యకు చెక్
- ఎమ్మెల్యే రాజా చొరవతో పనులు
- స్లూయిస్‌కు కొత్త గేట్ల ఏర్పాటు

సీతానగరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతో రైతుల జీవితాల్లో అరుణోదయం వచ్చింది.. సాగు బంగారమైంది.. నీటిపారుదల వ్యవస్థనూ చక్కదిద్ది పొలాలకు సక్రమంగా నీరు అందిస్తోంది.. ఎక్కడ ఇబ్బంది వచ్చినా నిధులు కేటాయిస్తూ అధిక ప్రాధాన్యం ఇస్తోంది.. స్లూయిస్ గేట్ల మరమ్మతులతో వచ్చిన ఇబ్బంది ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చొరవతో తీరింది. గత ఏడాది ఆగస్టు నుంచి సెప్టెంబర్ వరకూ మూడు సార్లు బొబ్బిల్లంక వద్ద స్లూయిస్ గేట్లు మరమ్మతులకు గురయ్యాయి. దీనివల్ల వరద నీరు స్లూయిస్ నుంచి కాటవరం, కూనవరం, మిర్తిపాడు, ఉండేశ్వరపురం తదితర గ్రామాల్లో వెయ్యి ఎకరాల పైబడి పంట పొలాల్లోకి చేరింది. బొబ్బిల్లంక స్లూయిస్ ద్వారా గోదావరిలోకి వెళ్లాల్సిన నీరు ఎగపోటుతో కొండ గోదారిగా రూపాంతం చెంది పంట పొలాలను ముంపులోకి తీసుకు వెళ్లింది.

తలుపులు తెరుచుకోక..

బొబ్బిల్లంక వద్ద స్లూయిస్ 8వ నంబర్ గేటు మరమ్మతులకు గురవడంతో అది తెరుచుకోక వరద నీరు కొండ గోదారిలో కలిసి వెనక్కి పోటెత్తింది. స్లూయిస్ వద్ద అఖండ గోదావరి నీటిమట్టం ఎక్కువగా ఉంటే ఆటోమెటిక్‌గా తలుపులు మూసుకుపోతాయి. అదేవిధంగా కొండగోదారి నీటిమట్టం ఎక్కువగా ఉంటే ఆటోమెటిక్‌గా తలుపులు తెరుచుకుని గోదావరిలో కొండగోదారి నీరు కలుస్తుంది. అయితే గోదావరి వరద రెండోసారి వచ్చేటప్పుడు బొబ్బిల్లంక స్లూయిస్ 8వ నంబర్ గేట్ మరమ్మతులకు గురవడంతో నీరు స్లూయిస్ నుంచి కొండగోదారి నీటిలో కలిసి కొండగోదారి ఉధృతం అవుతుంది. గత ఏడాది మూడుసార్లు వరద రావడంతో స్లూయిజ్ ద్వారా నీరు తొర్రి గడ్డ కాలువలోకి రావడంతో సుమారు వెయ్యి ఎకరాలకు పైబడి పొలాలు ముంపునకు గురయ్యాయి.

స్పందించి.. బాగుచేయించి

ఈ ఏడాది గోదావరి వరదల సమయం దగ్గర పడడంతో స్లూయిస్ గేట్లకు శరవేగంగా మరమ్మతులు చేపట్టారు. ఇందులో ఐదు గేట్లను తక్షణమే తొలగించి, కొత్తవి ఏర్పాటు చేశారు. రాజానగరం నియోజకవర్గ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషితో కలెక్టర్ అందించిన డీఎంఎఫ్ (డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్) రూ.24.80 లక్షలతో మరమ్మతులు పూర్తి చేశారు. ఐదు కొత్త గేట్లను ఏర్పాటు చేశారు. గోదావరి వరద సమయంలో స్లూయిస్ ద్వారా నీటి లీకేజీ సమస్యను పరిష్కరించారు. దీంతో పంట పొలాలకు ముంపు తప్పిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



బొబ్బిల్లంక వద్ద స్లూయిస్‌కు ఏర్పాటు చేసిన కొత్త గేట్లు



మిర్తిపాడులో గతేడాది ముంపునకు గురైన పొలాలు (ఫైల్)

ముంపు తప్పినట్టే..



గత ఏడాది వరదల సమయంలో కొండ గోదారి ఉధృతంగా రావడంతో పంట పొలాలు ముంపులోకి వెళ్లాయి. బొబ్బిల్లంక నుంచి ఎగపోటుతో నీరు వచ్చి ముందుగా ఉండేశ్వరపురం, మిర్తిపాడు పొలాలను ముంచేసింది. బొబ్బిల్లంక స్లూయిస్ వద్ద గేటు మరమ్మతులకు గురవడంతో వరద నీరు పంట పొలాలను ముంచింది. ప్రస్తుతం మరమ్మతులు చేసి, కొత్త గేట్లు ఏర్పాటు చేయడంతో ముంపు నుంచి బయటపడ్డాం.

– జొన్నలగడ్డ సత్యనారాయణ, రైతు, మిర్తిపాడు

ధీమాగా ఉండవచ్చు



బొబ్బిల్లంక స్లూయిస్ ద్వారా పంట పొలాలకు ముంపు భయం వీడింది. స్లూయిస్ ఐదు గేట్లు తొలగించి, కొత్తవి ఏర్పాటు చేశాం. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషితో కలెక్టర్ డీఎంఎఫ్ నిధులు మంజూరు చేయడంతో ఈ గేట్లను ఏర్పాటు చేశాం. దీనివల్ల గోదావరి వరద వచ్చినా నీరు స్లూయిస్ ద్వారా వెళ్లదు. దీంతో రైతులు ధీమాగా పంటల సాగు చేసుకోవచ్చు.

– ఎ.శివప్రసాద్, ఏజీఎల్‌బీ ఏఈ

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

జెడ్పీ సీఈఓ రమణారెడ్డి



జి.మామిడాడలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ రమణారెడ్డి

పెదపూడి: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ సీఈఓ ఎ.రమణారెడ్డి అన్నారు. జి.మామిడాడ గ్రామంలో సర్పంచ్ లంక మున్ని అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో కుల, ఆదాయ తదితర 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందిస్తున్నారన్నారు. వివిధ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్, రేషన్‌కార్డు సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం పరిపాలన వికేంద్రీకరిస్తూ ప్రజలకు మరింత దగ్గరగా తీసుకురావాలనే ఉద్దేశంతోనే వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చిందని చెప్పారు. అనంతరం 695 మంది లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.విజయకుమార్, తహసీల్దార్ టి.సుభాష్, ఉప సర్పంచ్ మేడపాటి తాతారెడ్డి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కర్రి శ్రీవెంకటరెడ్డి పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం సర్వే చేయాలి

జగనన్న సురక్ష సర్వే నిబంధనల ప్రకారం చేపట్టాలని ఈఓపీఆర్డీ మన్యం శ్రీనివాసుచౌదరి అన్నారు. పెదపూడిలో జరుగుతున్న జగనన్న సురక్ష సర్వే కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంతో గ్రామాల్లో విప్లవాత్మక మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు.

పుంత రోడ్ల ఆవశ్యకతను తెలియజేస్తాం



అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ కృష్ణారెడ్డి

అనపర్తి: రైతు సమస్యల పరిష్కారంలో భాగంగా పుంత రోడ్ల నిర్మాణ ఆవశ్యకతను వ్యవసాయ మార్కెట్ కమిటీ తీర్మానం ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. అనపర్తిలో బుధవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ గౌరవ అధ్యక్షులు, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అధ్యక్షతన పాలకమండలి సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాలకమండలి సభ్యులు పలు అంశాలపై చర్చించారు. రంగంపేట మండలం దొడ్డిగుంట, పెదపూడి మండలం జి.మామిడాడ, బిక్కవోలులో రైతు బజార్లు ఏర్పాటు చేయాలని, బిక్కవోలు మండలం బలభద్రపురం మార్కెట్ షెడ్లలో రోడ్లు ఏర్పాటు, నాలుగు మండలాల పరిధిలో రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులు తరలించుకునేందుకు పుంత రోడ్లను గ్రావెల్ రోడ్లగా నిర్మాణం చేసేందుకు ప్రతిపాదనలు చేశారు. సమావేశంలో ఏఎంసీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, ఏఎంసీ సెక్రటరీ బి.రవికుమార్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



దుప్పలపూడి జగనన్న కాలనీలో వీధి దీపాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని దుప్పలపూడి జగనన్న కాలనీలో రూ.74.67 లక్షలతో నూతనంగా ఏర్పాటుచేసిన వీధి దీపాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలపై దృష్టిసారించి త్వరితగతిన విద్యుత్ స్తంభాలు–ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో పీరారామచంద్రపురం సర్పంచ్ తేతల సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు కొండ ప్రేమలత, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి చిర్ల వీర్రాఘవరెడ్డి, జిల్లా ట్రేడ్ యూనియన్ కార్యదర్శి పడాల వెంకటరెడ్డి, పార్టీ నాయకుడు వల్లభశెట్టి రామసతీష్, పార్టీ గ్రామ కన్వీనర్ వాడ్రేవు చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ చిత్సారపు బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ శాఖ పాత్ర కీలకం

రాజానగరం: పేదల సొంతింటి కలను సాకారం చేయడం, ప్రభుత్వం నిర్దయించిన లక్ష్యాలను సాధించడంలో గృహనిర్మాణ శాఖ పాత్ర కీలకమైందని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ 45వ ఆవిర్భావ దినోత్సవాన్ని లాలాచెరువులోని పుష్కర వనంలో బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ హౌసింగ్ సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లాలో 68 వేల గృహాల నిర్మాణ లక్ష్యం కాగా ఇప్పటి వరకూ 21 వేలకు పైగా పూర్తయ్యాయన్నారు. ఇదే స్ఫూర్తితో లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. జిల్లా హౌసింగ్ అధికారి జి.పరశురాం, ఈఈ సోములు, డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ సభకు రావాలని పిలుపు

మధురపూడి: కాకినాడ జిల్లా ఎమ్మార్పీఎస్ సన్నాహక సభను గురువారం జగ్గంపేటలో నిర్వహించనున్నట్లు ఉత్తర కోస్తాంధ్ర జిల్లాల ఇన్‌చార్జి చిన్న సుబ్బారావు తెలిపారు. బుధవారం మధురపూడిలోని విమానాశ్రయానికి వచ్చిన ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీల అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు తరలి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

జగనన్న సురక్షతో అర్హులకు మేలు

రాజానగరం: అర్హులకు మేలు చేసేందుకు ప్రభుత్వం 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని అమలు చేస్తుందని మండల వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. కలవచర్లలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పార్టీ మండల కో–కన్వీనర్ గండి నానిబాబు, నాయకులు గంగిశెట్టి సోమేశ్వరరావు, వేమగిరి కృష్ణ, దంతులూరి రఘువర్మ, అడబాల జగదీష్ తదితరులు పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అవసరమైన వారికి వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

కాలువలకు జలకళ

గోకవరం: స్థానిక ఊరకాలువ, బురదకాలువ, పంట కాలువలు బుధవారం వరద నీటితో కళకళలాడాయి. మంగళవారం రాత్రి మండలంతో పాటు ఏజెన్సీలో కురిసిన భారీ వర్షానికి కాలువల్లో నీరు ప్రవహించింది. గోకవరం శివారున దేవీపట్నం ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి వెళ్లే మార్గంలో పంట కాలువ సప్టా పైనుంచి ఉధృతంగా నీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

సీసీ రోడ్ల నిర్మాణ పనుల పరిశీలన

అనపర్తి: స్థానిక ఇందిరానగర్‌లోని వివిధ ప్రాంతాల్లో నిర్మిస్తున్న సీసీ రోడ్లు నిర్మాణ పనులను సర్పంచ్ వారా కుమారి బుధవారం పరిశీలించారు. రూ.1.50 కోట్ల వ్యయంతో ఇందిరానగర్‌లో 13 సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి చిర్ల వీర్రాఘవరెడ్డి, ఎంపీటీసీ కొండేటి భీమేష్, వార్డు సభ్యురాలు కాకి సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజాకు కృతజ్ఞతలు



ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను మర్యాద పూర్వకంగా కలసిన మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు

సీతానగరం: వైఎస్సార్ సీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులుగా చినకొండేపూడికి చెందిన చిడిపి బంగారయ్య, మునికూడలికి చెందిన అంబటి రాజులను నియమించడం పట్ల జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు వారు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం రాజమహేంద్రవరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో జక్కంపూడి రాజాను ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న ఆధ్వర్యంలో బంగారయ్య, రాజులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ కష్టపడి పనిచేసే వారికి పార్టీలో ఎప్పుడూ సముచిత స్థానం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మద్దాల కొండలరావు, గెద్దాడ త్రిమూర్తులు, అంబటి రమణ, కొల్లి చిరంజీవి, ఎం.వెంకట్రావు పాల్గొన్నారు.

గడప గడపకూ విజయవంతం చేయండి

అనపర్తి: ఈ నెల 10 నుంచి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి నేతృత్వంలో కుతుకులూరులో ప్రారంభం కానున్న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి కోరారు. బుధవారం స్థానికంగా సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఉపసర్పంచ్ సబ్బెళ్ళ నాగిరెడ్డి, వైఎస్ ఎంపీపీ పులగం బులిరెడ్డి, మండల సాగు సలహా మండలి చైర్మన్ పడాల శ్రీనివాసరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పడాల వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి సత్కారం

బిక్కవోలు: మండలంలోని పందలపాకలో శ్రీపడాల పెద పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా చిర్ల శ్రీనివాస్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కోనాల సత్తిరాజు ఆయనకు స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోదకొండమ్మ వారి జాతర

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నం గ్రామ దేవత మోదకొండమ్మ వారి జాతర మహోత్సవం బుధవారం రెండో రోజు కొనసాగింది. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద సాయంత్రం నృత్య, నాటిక ప్రదర్శనలు అలరించాయి.